క్లుప్తంగా

ముక్కంటి ఆలయ ఈఓగా బాపిరెడ్డి


బాపిరెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఈఓగా బాపిరెడ్డిని నియమిస్తూ సోమవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్‌గా బాపిరెడ్డి పనిచేశారు. రెండేళ్ల తర్వాత ఇక్కడ రెగ్యులర్ ఈఓను నియమించడంపై భక్తులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని అమరావతి జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదును మంగళవారం ప్రారంభించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆ అసోసియేషన్ నాయకులు మాట్లాడారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామన్నారు. మహిళా నాయకులుగా కల్యాణి, శ్రీనిధి, కామాక్షి, అఫ్రిన్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి కోగిలి మునిచందు, శివ, సల్మాన్, బాబి, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, మురుగు కాలువలకు రూ.2కోట్లు

–డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్


సిమెంట్ రోడ్డు పరిశీలిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్


ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు త్వరితగతిన చేపట్టాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని మడిబాక అరుంధతివాడలో నూతన సిమెంట్ రోడ్డు పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ చంద్రశేఖర్‌రాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ క్యాన్ల వితరణ


అంగన్‌వాడీ కేంద్రాలకు క్యాన్లను అందజేస్తున్న బీజేపీ నేత కేబీ గురుదేవ్

వరదయ్యపాళెం: మండలంలోని 65 అంగన్‌వాడీ కేంద్రాలకు బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కేబీ గురుదేవ్ తన సొంత నిధులతో శుద్ధజలాలు నింపుకునేందుకు క్యాన్లను వితరణగా అందజేశారు. మంగళవారం ఆయనే స్వయంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి సిబ్బందికి క్యాన్లను అందించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు పురుషోత్తం, జిల్లా యువ మోర్చా కార్యదర్శి ఢిల్లీప్రకాష్, జనసేన జిల్లా కార్యదర్శి తడ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు ప్రసాద్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్యుడు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ నర్సింగ్ కళాశాల, చంద్రగిరిలోని మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చ్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం నర్సింగ్ విద్యార్థినులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితిలో రోగి ప్రాణాలు కాపాడే పద్ధతులను వివరించారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గంగాభవాని, ఎస్వీ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సునీత, హైదరాబాద్ ఐసీఎంఆర్–నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషియన్‌లోని క్లినికల్ ఎపిడెమియాలజీ డివిజన్ విభాగాధిపతి డాక్టర్ జేజే బాబు, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ వెన్నెల సాహితి, డాక్టర్ సురేష్ కుమార్, డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భూ కబ్జాను అడ్డుకోండి

నాయుడుపేట టౌన్: బిరదవాడ గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా అడ్డుకోవాలంటూ గ్రామస్తులు మంగళవారం డీటీ రాజేంద్రకు వినతి పత్రం ఇచ్చారు. బిరదవాడ గ్రామస్తులు మాట్లాడుతూ భూకబ్జాపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి కాపాడుకుంటామని గ్రామస్తులు వెల్లడించారు. బిరదవాడ వద్ద ఉన్న భూమిని పేదలకు పంపిణీ చేయాలని కోరారు.

పోలీస్ క్వార్టర్స్ శిథిలం

శాంతిభద్రతలను పర్యవేక్షించే రక్షకభటుల నివాస గృహాలు వరదయ్యపాళెంలో శిథిలమైపోతున్నాయి. ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు కాలక్రమంలో ఒక్కొక్కటిగా మరమ్మతులకు గురవ్వడంతో పట్టించుకునే దిక్కు లేదు. కోట్లాది రూపాయల విలువ చేసే ఆస్తుల గురించి ఆ శాఖ ఏమాత్రం దృష్టి సారించడం లేదు.


శిథిల దశకు చేరుకున్న పోలీస్ క్వార్టర్స్ భవనాలు

- పట్టించుకోని ప్రభుత్వం
- వృథాగా కోట్ల రూపాయల ఆస్తులు

వరదయ్యపాళెం: 1989లో అప్పటి ప్రభుత్వం, పోలీస్ సిబ్బంది నివాసాల కోసం వరదయ్యపాళెం హైస్కూల్ సమీపంలో క్వార్టర్స్ నిర్మించింది. అయితే పదేళ్లుగా ఇవి పూర్తిగా శిథిలమై వినియోగంలో లేవు. దీంతో సిబ్బంది సైతం అద్దె గృహాలకు మారారు. అసలే శ్రీసిటీ, ఇతర పరిశ్రమలు, కల్కి ట్రస్టులు వరదయ్యపాళెం పరిసర ప్రాంతాల్లో ఉండడంతో అద్దె ఇళ్లకు వరదయ్యపాళెం ఎనలేని డిమాండ్ ఉండడంతో ఇక్కడ అద్దెలు సైతం ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వేలకువేలు అద్దెలు చెల్లించడం కూడా తమకు ఇబ్బందిగా మారిందని పోలీసులు వాపోతున్నారు.

పట్టించుకోని పోలీస్ శాఖ

వరదయ్యపాళెంలో సుమారు రెండెకరాల స్థలంలో పోలీస్ క్వార్టర్స్‌ను మూడున్నర దశాబ్దాల క్రితం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ భూమి విలువ రూ. 5కోట్లకు పైమాటే! అంతటి విలువైన ఆస్తులు ఉన్నప్పటికీ ఆ శాఖ ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. ఇప్పటికే మండలంలో వివిధ చోట్ల ప్రభుత్వ స్థలాలపై కబ్జారాయుళ్ల కన్ను పడింది. కొన్నిచోట్ల ఆక్రమణలకు పాల్పడం, అధికారుల దృష్టికి వెళ్లడంతో అడ్డుకోవడం లాంటివీ చోటుచేసుకోవడం విదితమే. ఈ నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న పోలీస్ క్వార్టర్స్ స్థలాన్ని సైతం ఆక్రమణదారులు రాజకీయ అండతో కబ్జాకు పాల్పడినా ఆశ్చర్యపడాల్సిన పనిలేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా పోలీస్ శాఖ దీనిపై దృష్టి సారించి, శిథిలమైన గృహాలను తొలగించి, కొత్త క్వార్టర్స్ నిర్మించి, మిగిలిన స్థలాన్ని పార్కు, ఇతర మౌళిక వసతులకు అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


వరదయ్యపాళెంలో శిథిలమై పోతున్న పోలీస్ క్వార్టర్స్ భవనాలు


కూలేందుకు సిద్ధంగా ఉన్న పోలీస్ క్వార్టర్స్ భవనాలు

జీతాలివ్వని కూటమి ప్రభుత్వం

- నాలుగు నెలలుగా అవస్థలు పడుతున్న 108 సిబ్బంది
- అప్పులతో కుటుంబ పోషణకు మల్లగుల్లాలు


108 సిబ్బంది

శ్రీకాళహస్తి: ఆపత్కాలంలో ప్రాణాలు పోస్తున్న 108, 104, 102 సిబ్బందికి కూటమి ప్రభుత్వం జీతాలు ఇవ్వడం లేదు. అధికారంలోకి వచ్చింది మొదలు వీరిపై శీతకన్ను చూపుతోంది. నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణకు అవస్థలు పడుతున్నారు. అప్పులతో కనాకష్టంగా బతుకీడుస్తున్నట్టు ఆవేదన చెందుతున్నారు. జీతాలు ఇవ్వక దీపావళి పండుగ కూడా జరుపుకోలేని దుస్థితిలోకి ప్రభుత్వం నెట్టివేసిందని వాపోతున్నారు. పండుగ రోజైనా తమ బతుకుల్లో వెలుగు నింపకపోదా? అనే ఆశతో ఎదురుచూస్తున్నారు.

వైభవంగా ప్రదోష పూజలు


నందికి అభిషేక పూజలు చేస్తున్న పూజారులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో శివనామస్మరణల మధ్య అత్యంత వైభవంగా ప్రదోష పూజలు జరిగాయి. మంగళవారం శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో ప్రదోష పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా నందీశ్వర స్వామి, శ్రీ వాల్మీకేశ్వర స్వామివారికి ఏకకాలంలో ప్రదోష పూజలు నిర్వహించారు. అభిషేకం అనంతరం స్వామి అమ్మవార్లను, ప్రదోష నందీశ్వరస్వామిని పుష్పాలతో సందరంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు, మహాదీపారాధన చేపట్టారు. ఉభయదారులుగా నింద్ర శ్రీనివాసమిల్క్ ఎండీ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వారికి ఆలయ కార్యనిర్వాహణాధికారి లత ఆలయ మర్యాదలతో స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు.

'బాలనేస్తాలు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాల పిల్లల సృజనాత్మకతకు నిదర్శనం 'బాలనేస్తాలు' కథా సంకలనం పుస్తకమని మండల విద్యాశాఖాధికారులు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం అన్నారు. మంగళవారం మండలంలోని కల్లివెటు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రూపేష్‌కుమార్ అధ్యక్షతన పాఠశాల తెలుగు పండితులు, రచయిత యువశ్రీమురళి సంపాదకత్వంలో ముద్రించిన కల్లివెట్టు బడి పిల్లల కథా సంకలనం 'బాలనేస్తాలు' పుస్తకాన్ని ఎంఈఓలు ఆవిష్కరించి తొలి ప్రతిని బాల సాహితీవేత్త కృష్ణస్వామి రాజుకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాష తల్లితో సమానమని, విద్యార్థులు భవిష్యత్తు భాషా వారసులని తెలిపారు. అనంతరం శతావధాని ఆముదాల మురళి బాలరచయితలని, బాల సాహిత్య కథలు రాసిన విద్యార్థులను శాలువా కప్పి పుస్తకం అందించి సత్కరించారు.

విద్యా, వసతి దీవెన బిల్లులు విడుదల చేయాలి


ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

శ్రీకాళహస్తి: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతిదీవెన బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక తొట్టంబేడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. పట్టణాధ్యక్షుడు గురవయ్య మాట్లాడుతూ, విద్యాదీవెన, వసతి దీవెన బిల్లులు రూ.3,480 కోట్ల మేర పేరుకుపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తారా, లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారిందని ధ్వజమెత్తారు. దీనిపై తల్లులు ఆందోళన చెందుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని దుయ్యబట్టారు.డిగ్రీ విద్యలో మేజర్, మైనర్ విధానాన్ని తొలగించాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, మెస్‌ఛార్జీలను నెలకు రూ.3వేలు ఇవ్వాలన్నారు. జీవో నెంబరు 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపజేయాలన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయరాదని సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డేవిడ్, నాగరాజు, గంగాధర్, శ్యామ్, భువనేష్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆజాద్ సంస్కరణలు భేష్

- ఇన్‌చార్జ్ ఈఓగా తనదైన ముద్ర
- అధికార పార్టీ నాయకులకు మాత్రం కంటగింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఇన్‌చార్జ్ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఆలయంలో పలు సంస్కరణలు తెచ్చి తనదైన ముద్ర వేశారు. బాధ్యతలు స్వీకరించిన రెండు నెలల్లో ఆలయ ఉద్యోగులను పరుగులు తీయించారు. దళారీ వ్యవస్థ నిర్మూలన కోసం గట్టిగా ప్రయత్నించారు. రాహుకేతు మండపాలు, ఆలయంలో భక్తులను అడ్డగోలు వసూళ్లను నియంత్రించారు. ఆలయ ఉద్యోగులు యూనిఫాం, ఐడీ కార్డు తప్పనిసరిగా ఉండాలని బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేశారు. ఇంజినీరింగ్ శాఖ పనుల పర్యవేక్షణను గాటన పెట్టారు. ఆలయంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త తొలగించి బయటపడేశారు. కాశీ విశ్వనాథుని గుడిని భక్తులకు దర్శనానికి అనుకూలంగా మార్చారు. గోశాలలో పశుపోషణపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. దీపాలు, దారాలపేరుతో భక్తులను మోసం చేసే దళారులను నియంత్రించారు. రెండేళ్ల క్రితం నిర్మించిన బాత్‌రూములను భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. బియ్యపు కృష్ణారెడ్డి మంపడంలో సమాచార కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ–ఫైలింగ్ విధానాన్ని అమలు చేయించారు.

శుక బ్రహ్మాశ్రమం వద్ద కోనేరును ప్రక్షాళన చేసి మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. అయితే అధికార పార్టీ నాయకులకు సమాధానం చెప్పడం లేదని, తాము చెప్పిన వారికి కాంట్రాక్టులు ఇవ్వడం లేదని ఆయనపై బురద చల్లే ప్రయత్నం చేశారు. రాహుకేతు మండపాల్లో పూజలకు భక్తులు సంప్రదాయ దుస్తులతో హాజరయ్యేలా చూశారు. అయితే దీనిపై విమర్శలు వచ్చాయి. రెండు నెలల్లో ఒక ఏఈవో, వేదపండితుడు, ఏపీ ఆర్వోను సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఆయనను బదిలీ చేశారనే ప్రచారంలోకి రావడం గమనార్హం!

మందుబాబులకు పదేసి వేల జరిమానా

శ్రీకాళహస్తి: మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులో పదిమందికి జరిమానా విధించినట్లు 1వ పట్టణ పోలీసులు తెలిపారు. సోమవారం పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. పట్టుబడిన పదిమంది మందుబాబులను మంగళవారం కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారు. అలాగే, న్యూసెన్స్ కేసులో 22మందికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు.

ఈఎస్ఐలో ఆయుర్వేద దినోత్సవం


మాట్లాడుతున్న వైద్యులు

తిరుపతి తుడా : అన్నమయ్య సర్కిల్ సమీపంలోని కార్మిక రాజ్య బీమా (ఈఎస్ఐ) ఆస్పత్రిలో మంగళవారం ఘనంగా జాతీయ ఆయుర్వేద దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యం, ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే ఉపయోగాలపై రోగులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఏపీఎస్ ప్రసాద్, వైద్యులు కె.శ్రీధర్, పి.రమేష్ కుమార్, శ్రీలత, గాయత్రి, మంజరి, నర్సింగ్ సూపరింటెండెంట్ సి.అమ్ములు పాల్గొన్నారు.

కంప్యూటర్లతో భాష, సాహిత్యం కొత్త పుంతలు


అతిథులకు జ్ఞాపిక అందజేస్తున్న అధ్యాపకులు

తిరుపతి సిటీ : శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో మంగళవారం తెలుగు సాహితీ సమితి సదస్సును ఘనంగా నిర్వహించారు. తెలుగుశాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ, కంప్యూటర్ల ద్వారా భాష, సాహిత్యం కొత్త పుంతలు తొక్కుతున్నాయన్నారు. ఈ అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. సాహితీ సమితి సలహాదారు డాక్టర్ వై.సుభాషిణి మాట్లాడుతూ, ఇలాంటి సదస్సుల ద్వారా పిల్లల్లో భాషాభిమానంతోపాటు కార్యదక్షత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయన్నారు. అనంతరం అతిథులను జ్ఞాపికలతో సత్కరించారు. జాతీయ సంస్కృత వర్సిటీ రిజిస్ట్రార్ రమశ్రీ, అధ్యాపకులు యువశ్రీ, లక్ష్మీప్రియ, హరి పద్మరాణి, శారద, నిర్మల, నీరజ, వాణి పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో ఆయుధ పూజ


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే, మేయర్, అధికారులు

తిరుపతి తుడా : మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఘనంగా ఆయుధ పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ శిరీష, కమిషనర్ మౌర్య ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ వాహనాలకు పూజలు చేశారు. వారు మాట్లాడుతూ కార్పొరేషన్ అధికారులు, సిబ్బందికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. వాహనాలను జాగ్రత్తగా నడపాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాధవ్, రవి, మేనేజర్ హసీమ్ పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి


పూజలు నిర్వహిస్తున్న అధికారులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీలో ధన్వంతరి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, రిజిస్ట్రార్ రమాశ్రీ ఆధ్వర్యంలో ధన్వంతరి విగ్రహానికి పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ధన్వంతరి బోధనలు పాటిస్తే రోగాలను నిర్మూలించవచ్చని సూచించారు. అందుకే ధన్వంతరిని ఫాదర్ ఆఫ్ ఆయుర్వేదంగా వ్యవహరిస్తారని వెల్లడించారు. డాక్టర్ బాలదత్తాత్రేయ, డీన్ దక్షిణామూర్తి శర్మ, ఎన్.లత, కాదాంబిని, డాక్టర్ చిరంజీవి పాల్గొన్నారు.

స్విమ్స్‌లో..

తిరుపతి తుడా : స్విమ్స్ యూనివర్సిటీలోని పద్మావతి ఆడిటోరియంలో ఆయుర్వేద శాస్త్ర పితామహుడు ధన్వంతరి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ ధన్వంతరి జయంతిని జాతీయ ఆయుర్వేద దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. డాక్టర్ వనజాక్షమ్మ, పాల్గొన్నారు.

రసవత్తర పోరు.. విజేతలు వీరు


టి మహేష్, ఏ మునివెంకట రెడ్డి , జి రాజ్ కుమార్, చీర్ల కిరణ్, ఎస్వీ దొరై రాజు

- నేడు అధ్యక్ష, ఉపాధ్యక్ష, కోశాధికారి పదవులకు ఎన్నిక


ఆర్ కిషోర్ కుమార్, టి హేమ సుధ

తిరుపతి సిటీ, అలిపిరి: టీటీడీ ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ బ్యాంకు డైరెక్టర్ పదవులకు ఎన్నికలు సోమవారం ముగిశాయి. మొత్తం 35మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. తిరుమల, తిరుపతిలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాలలో మొత్తం 6,349 ఓటర్లకు గాను 5,553 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారి ఉమాపతి వెల్లడించారు. మూడు రౌండ్ల కౌంటింగ్ ప్రక్రియ కోసం 8 టేబుళ్లను ఏర్పాటు చేసి సోమవారం రాత్రి 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభించారు. మంగళవారం వేకువజాము 3 గంటల వరకు కౌంటింగ్ సాగింది.

రౌండ్ రౌండ్‌కూ ఉత్కంఠే

మొత్తం మూడు రౌండ్ల లెక్కింపులో ప్రతి రౌండ్‌కూ అభ్యర్థుల్లో టెన్షన్ స్పష్టంగా కన్పించింది. బరిలో నిలిచిన 35 మందిలో సుమారు 10 మంది అభ్యర్థులు హోరాహోరీగా పోటీపడ్డారు. తొలి రౌండ్ ఫలితం అర్ధరాత్రి 12.45 గంటలకు వెలువడింది. పూర్తి ఫలితాలను మంగళవారం వేకువజాము 4.30 గంటలకు అధికారికంగా ప్రకటించారు.

నేడు అధ్యక్ష పదవికి ఎన్నిక

టీటీడీ ఎంప్లాయిస్ బ్యాంకు ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల్లో విజయం సాధించిన ఏడుగురు బ్యాంకు డైరెక్టర్లలో అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కోశాధికారి పదవులకు బుధవారం ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తాం. ఉదయం 9 గంటలకు టీటీడీ సహకార పరపతి సంఘం కార్యాలయంలో ఎన్నికైన పాలకమండలి సభ్యుల సమావేశం జరగనుంది. 10 గంటలకు అధ్యక్ష , ఉపాధ్యక్ష, కోశాధికారి ఎన్నిక ప్రక్రియ ప్రారంభమవుతుంది.

–ఎమ్.ఉమాపతి, ఎన్నికల అధికారి, టీటీడీ తిరుపతి

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు సత్యవేడు విద్యార్థులు


రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన సత్యవేడు విద్యార్థులు

సత్యవేడు: మండలంలోని సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారు. కడప జిల్లా కమలాపురంలో అండర్–14, తూర్పు గోదావరి అమలాపురంలో అండర్–17 విభాగంలో నిర్వహించనున్న పోటీలలో సత్యవేడు క్రీడాకారులు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు. అండర్–17 విభాగంలో డి.మునీంద్ర, డి.హేమంత్, ఎం. వైశాలి, ఎస్.అశ్విత, ఎస్ అబ్దుల్ హమీద్, అండర్ 14 విభాగంలో కే.బాలస్వరూప్, ఎస్. వసంత్‌కుమార్, జీ.పవిత్ర, సి.వర్షిణి ఎంపికయ్యారని ఇన్‌చార్జి హెచ్ఎం జే. పాండురంగయ్య పీడీ మురళి చెప్పారు. మంగళవారం వారిని హెచ్ఎం, పీడీతోపాటు పి.వెంకటేశ్వర్లు, మనోహర్, భాస్కర్ తదితరులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు కనపర్తి విద్యార్థి..


శ్రీకాళహస్తి: విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం పెద్దకనపర్తి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి కుమారస్వామి అండర్–14 విభాగంలో రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం తెలిపారు. సత్యవేడులో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని, నవంబర్‌లో కడపలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. కుమారస్వామిని వ్యాయామోపాధ్యాయుడు చెంగల్రాయులు, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాసులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు అభినందించారు.

ఆక్రమిత స్థలం.. ఆగని నిర్మాణం


షాపింగ్ కాంప్లెక్స్ సాగుతున్న పనులు

చంద్రగిరి : మండలంలోని మల్లయ్యపల్లె మార్గంలో ఓ మహిళ ప్రభుత్వ భూమిని ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టింది. సర్వే నంబర్ 1016లోని వాగు పోరంబోకులో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దార్ శివరామసుబ్బయ్య స్పందించి వెంటనే పనులు ఆపేయాలని ఆదేశించారు. అయితే కబ్జాదారులు సదరు ఆదేశాలను బేఖాతరు చేస్తూ నిర్మాణ పనులు కొనసాగిస్తూనే ఉన్నారు. ఆక్రమణ వెనుక టీడీపీ నేతలు ఉండడంతో అధికారులు సైతం చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో గ్రామస్తులు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కూడా షాపింగ్ కాంపెక్స్ పనులు జరుగుతుండడంతో రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. వీఆర్ఏ అక్కడకు చేరుకుని నిర్మాణ పనులు ఆపేయాలని చెప్పి వెళ్లిపోయారు. అయితే కబ్జాదారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. నాన్పుడు ధోరణిని వీడి రెవెన్యూ అధికారులు కఠినంగా వ్యవహరించి కబ్జాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.